



సన్నాపురం వద్ద నేలకొరిగిన వరిపంట

వరిగిన పంట

● ఎడతెరిపి లేని వర్షాలతో నేల వాలిన వరి పంట

8



పీఠంపైనే గురి..!

● పరిషత్ సభాపతిపై కాంగ్రెస్ కన్ను
● నలుగురి చేరికతో పార్టీకి పెరిగిన మెజారిటీ
● అవిశ్వాసం అంటే ముందే రాజీనామా : హొరట్టి



బసవరాజహొరట్టి

బెంగళూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల తర్వాత విధానపరిషత్‌లో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ సాధ్యమైంది. ప్రస్తుతం సభాపతిగా బీజేపీ నుంచి ఎన్నికైన బసవరాజ హొరట్టి కొనసాగుతున్నారు. హొరట్టిది దేశంలోనే రికార్డు కల్గిన పదవీకాలం. పరిషత్ సభ్యుడిగా ఒకే స్థానం నుంచి ఏడుసార్లు గెలుపొందిన ఘనత ఆయనది. బీజేపీ నుంచి గెలుపొందినా పారదర్శకత, అన్ని పార్టీల పట్ల సమానధోరణితో వ్యవహరిస్తారనే పేరుంది. జేడీఎస్ పార్టీలో ఆరుసార్లు గెలిచి ఇటీవలి మూడేళ్లక్రితం ఎన్నికల్లో బీజేపీలో చేరి గెలుపొందారు. గతంలో ఆయన మంత్రి పదవితోపాటు కీలకమైన హోదాలలో కొనసాగారు. ఈ ఏడాది ప్రారంభంలో ముగ్గురి పదవీకాలం ముగియడం, సీపీ యోగేశ్వర్‌కు ఇంకా గడువు ఉన్నా చన్నపట్టణ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన మేరకు పరిషత్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇలా ఖాళీ అయిన నాలుగుస్థానాలను భర్తీ చేసేందుకు సీఎం సిద్దరామయ్య సుదీర్ఘ కసరత్తు చేశారు. దాదాపు నాలుగైదుసార్లు అధిష్టానంతో చర్చించినా వారు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. ఇటీవల వరుసగా రెండుసార్లు ఢిల్లీ వెళ్లిన సందర్భంలో అగ్రనేతలతో చర్చించిన మేరకు వారి దిశా నిర్దేశంతో నలుగురిని ఎంపిక చేశారు. వీరిలో రమేశ్‌బాబు గతంలో జేడీఎస్ నుంచి పరిషత్ సభ్యుడిగా కొనసాగినవారే. మిగిలిన ముగ్గురూ తొలిసారి పరిషత్‌లోకి ప్రవేశిస్తున్నారు. వీరిలో శివకుమార్ సీనియర్ పాత్రికేయుడిగా సుపరిచితుడు. ఇక ఆరతి కృష్ణ రాష్ట్రప్రభుత్వ ఎన్నారై విభాగం ఉపాధ్యక్షురాలిగా, ఏఐసీసీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఇక కేపీసీసీ ఎస్సీ విభాగం అధ్యక్షులైన జక్కప్పణ్ణవర్‌కు అవకాశం దక్కింది.


పరిషత్‌లో బలాబలాలు ఇలా

పరిషత్‌లో 75మంది సభ్యులు ఉంటారు. బీజేపీ 29 మంది, జేడీఎస్ ఏడుగురితో కలిపితే 36మంది ఉన్నారు. ఇక కాంగ్రెస్‌లో కొత్తగా నలుగురితో కలిపితో 37మంది సభ్యులు అవుతారు. సభాపతి ప్రస్తుతం బీజేపీకి చెందినవారు. ఇక ఏకైక ఇండిపెండెంట్ సభ్యుడు లఖన్ జార్కిహొళి ఉన్నారు. అతను ఏ పార్టీకి మద్దతు ఇస్తారనేది కీలకమైన అంశం. జార్కిహొళి కుటుంబంలో ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో బీజేపీ నుంచి రమేశ్ జార్కిహొళి, బాలచంద్ర జార్కిహొళిలు ఉన్నారు. కాంగ్రెస్ నుంచి సతీశ్ జార్కిహొళి కీలకమైన ప్రజాపనులశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఇద్దరు అన్నలు చెరో పార్టీలో ఉన్నారు. లఖన్ జార్కిహొళి ఏ సోదరుడి మాట వింటారనేది కీలకం కానుంది.

● పార్టీ సీనియర్ నేత బీకే హరిప్రసాద్‌ను మంత్రిని చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగానే ఆయనను మంత్రి చేయడం ద్వారా సభా నాయకుడి హోదాలో ప్రతిపక్షానికి ధీటుగా ఎదుర్కొంటారనే ముఖ్యమంత్రి భావిస్తున్నారు. కానీ డీసీఎం డీకే శివకుమార్ శిబిరం నుంచి ఎస్ రవి పేరు ప్రధానంగా వినిపిస్తోంది. కాగా పరిషత్‌లో జేడీఎస్, బీజేపీల నుంచి ఎన్నికై ప్రస్తుతం కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగుతున్న మాజీ ఉపసభాపతి పుట్టణ్ణ కూడా సభాపతి హోదా కోసం ప్రయత్నిస్తున్నారు. రవి. పుట్టణ్ణలు పూర్తిస్థాయిలో డీకే శివకుమార్‌కు ప్రధాన అనుచరులుగా ముద్ర పడినవారు.

పరిషత్‌లో బలం లేక అధికార పార్టీకి ఇబ్బందులు

బీజేపీ, అధికార కాంగ్రెస్ పార్టీలకు పరిషత్ సభాపతి స్థానం కీలకమైనది. శాసనసభలో సంపూర్ణ మెజారిటీ ఉన్న కాంగ్రెస్ పార్టీ సునాయాసంగా బిల్లులకు ఆమోదం దక్కించుకుంటుంది. కానీ పరిషత్‌లోకి వచ్చేసరికి సభాపతితోపాటు మెజారిటీ బీజేపీకి ఉన్నందున ప్రతిబిల్లుకు అడ్డంకి అవుతోంది. పరిషత్ తిరస్కరించిన బిల్లులు మరోసారి శాసనసభలో ఆమోదింపచేసుకోవాల్సి ఉంటుంది. ఇలా ప్రతి బిల్లుకు అభ్యంతరం, సుదీర్ఘ చర్చ, ప్రభుత్వ తప్పిదాలను పరిషత్ వేదికగా ఎండగడుతున్న తరుణంలో సభాపతి హోదాను దక్కించుకోవాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉంది. కానీ సీఎం సిద్దరామయ్యకు ప్రస్తుత సభాపతి బసవరాజ హొరట్టిపట్ల గౌరవంతోపాటు అభిమానం ఉంది. అయితే కాంగ్రెస్‌లో కీలకనేతలు మాత్రం సుముఖంగా లేరు. నలుగురు సభ్యులను నామినేట్‌తోపాటు వారు ప్రమాణ స్వీకార ప్రక్రియ ముగిసిన వెంటనే సభాపతి విషయంలో కాంగ్రెస్‌లో చర్చ జోరందుకుంది. ఇటీవలే శాసనసభ వర్షాకాల సమావేశాల ముగిశాయి. తదుపరి శీతాకాల సమావేశాలు ఈ ఏడాది ఆఖరులో కొనసాగనున్నాయి. అప్పట్లో బసవరాజహొరట్టి సభాపతి స్థానానికి రాజీనామా చేస్తే కొత్తసభాపతి ఎంపిక సులభతరం కానుంది. లేనిపక్షంలో సభాపతిపై శాసనసభ శీతాకాల సమావేశాల వేళ అవిశ్వాసతీర్మానం పెట్టే ఆలోచనలో కాంగ్రెస్ ఉన్నట్టు తెలుస్తోంది. అయితే అవిశ్వాసం ప్రస్తావన తెస్తే పదవికి రాజీనామా చేస్తానని, కుర్చీని అంటి పెట్టుకుని ఉండాలనే ఆలోచన లేదని ఇటీవలే బసవరాజహొరట్టి బహిరంగ ప్రకటన చేశారు.



బోసరాజువైపే సీఎం మొగ్గు

రెండేళ్ల పాలనలో సీఎం సిద్దరామయ్య ఎప్పుడూ సొంత పార్టీ ఎమ్మెల్సీలతో భేటీ అయిన దాఖలాలు లేవు. కానీ ఇటీవల మూడు రోజులకిందట కేవలం కాంగ్రెస్ ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇదే సందర్భంలోనే వారికి ప్రత్యేక గ్రాంట్లు ఇచ్చే అంశంపైనా చర్చ జరిగింది. పరిషత్ సభ్యులలో మంత్రిగా కొనసాగుతున్నవారు బోసరాజు ఒక్కరే ఉన్నారు. ఆయనను మంత్రి పదవినుంచి తప్పించి సభాపతి చేయాలని ముఖ్యమంత్రి ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం





రాష్ట్ర పరీక్షల బోర్డు కార్యాలయం

- 6 నుంచి 10 తరగతులకు పునఃశ్చరణ
- 27 జిల్లాలకు 'మరుసించన' విస్తరణ
- విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక ప్రాక్టికల్ బుక్స్
- వినూత్న సంస్కరణలకు విద్యాశాఖ సిద్ధం



బెంగళూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. పిల్లలు దూరం కారాదనే నిర్బంధ విద్యను అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం, షూతోపాటు దూర ప్రాంత విద్యార్థులకు అర్హులైనవారికి ఉచిత సైకిళ్ల సమకూరుస్తోంది. తద్వారా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు దగ్గర చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పలు స్వచ్ఛంద సంస్థలు, ఎంతోమంది దాతలు సహకారం అందిస్తున్నారు. అయితే ఫలితాల్లో గుణాత్మకతను పెంచేందుకు ప్రభుత్వం మరింత కృషి చేస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు సైతం అప్‌డేట్ అయ్యేందుకు పలు మార్గదర్శకాలు, తర్ఫీదు ఇస్తున్నారు. ఆయా సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను మెరుగు చేయాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో మొత్తం 35 విద్యాజిల్లాలు ఉన్నాయి. వీటిలో దక్షిణకన్నడ, ఉత్తరకన్నడ, శిరసి, ఉడుపి, శివమొగ్గ, హాసన్, చిక్కమగళూరు, కొడగు జిల్లాల్లో గుణాత్మకత బాగుంది. ఈ జిల్లాలకొన్ని పాఠశాలల్లో విద్యార్థుల నేర్చుకునే సామర్థ్యం తక్కువగా ఉండవచ్చు. అయితే ఈ జిల్లాల్లో మరుసించన పథకాన్ని ప్రస్తుతానికి వర్తింపచేసేందుకు నిర్ణయం తీసుకోలేదని విద్య, సాక్షరతాశాఖ వర్గాలు అభిప్రాయపడ్డాయి. మరుసించన పథకం 2025-26 సంవత్సరానికి 27 విద్యాజిల్లాలకు 6నుంచి 10వ తరగతులకు వర్తింపచేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 18 లక్షల మందికి ప్రయోజనం కానుంది. పథకం అమలుకు చర్యలు తుదిరూపు దశలో ఉన్నాయి. దసరా సెలవులకు కార్యరూపం దాల్చే అవకాశం ఉందని సమగ్ర విద్య కర్ణాటక రాష్ట్ర యోజనా డైరెక్టర్ కే విద్యాకుమారి అభిప్రాయపడ్డారు.


విద్యలో వెనుకబడిన పిల్లలను గుర్తించి పాఠశాల సమయంలోనే వారి సందేహాలను తీర్చి అభ్యాసం చేయించడం, పునఃశ్చరణ (రివిజన్) వంటివి చేయదలిచారు. తద్వారా పిల్లల్లో నేర్చుకునే సామర్థ్యం పెరగనుంది. ఇందుకుగాను ఉపాధ్యాయులకు ప్రత్యేక మాడ్యూల్ పుస్తకాలు, విద్యార్థులకు అభ్యాస పుస్తకాలను సిద్ధం చేశారు. డీఎస్‌ఈఆర్‌టీకి స్వచ్ఛంద సంస్థలు పీపుల్ ఫర్ యాక్షన్ సంస్థ, జె-పాల్ యోజనె అమలులో భాగం కానుంది. కాలానికి అనుగుణంగా సలహాలు ఇవ్వనున్నాయి. నేర్చుకోవడంలో 40శాతం కంటే తక్కువగాను, 60శతం కంటే తక్కువగా ఉన్నవారికి మరుసించన పథకం కింద ప్రత్యేక తరగతులు నిర్వహించే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి భిన్నమైన సలహాలు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

గుణాత్మక ఫలితాలు సాధించాలనే..

పదో తరగతి ఫలితాలలో తక్కువ ఫలితాలు, ఉత్తీర్ణతశాతం తక్కువగా ఉండడాన్ని గుర్తించారు. అంతేకాక పిల్లలు ఏ దశలో ఎంతమేర నేర్చుకున్నారనేది స్పష్టత రావడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తరగతిలోనే సంస్కరణలు చేపట్టదలిచారు. అందుకే మరుసించన పథకాన్ని రూపొందించారు. ప్రతి విద్యార్థి కనీస స్థాయికి తక్కువ లేకుండా మార్కులు సాధించడం ద్వారా ఉత్తీర్ణతాశాతం పెరగాలంటే ప్రారంభం నుంచే గుణాత్మక విద్య అవసరంగా గుర్తించారు. అందుకుగాను అభ్యాసమే పరిష్కారంగా భావించారు. ప్రతి పాఠంలోనూ సందేహాల నివృత్తి, పునఃశ్చరణ చేయడమే పరిష్కారంగా నిర్ధారించారు. క్రమం తప్పకుండా పాఠాలను ఎలా అభ్యాసం చేయాలనేది ఇందులో పొందుపరిచి ఆదిశగా విద్యార్థులను ప్రోత్సహించనున్నారు.

ప్రయోగం విజయవంతం

2023-24లో ప్రయోగాత్మకంగా 17 జిల్లాల్లో ఎంపిక చేసిన 93 తాలూకాల్లో 9వ తరగతి విద్యార్థులకు 'మరుసించన' పేరిట పథకాన్ని అమలు చేశారు. గత ఏడాది 6-10వ తరగతి విద్యార్థులకు విస్తరించారు. ప్రతి విద్యార్థికి, ప్రతి ఉపాధ్యాయుడికి ఆయా సబ్జెక్టులలో ప్రత్యేక ప్రాక్టికల్ బుక్స్ సిద్ధం చేశారు. ప్రతి సబ్జెక్టులోనూ విద్యార్థి రాణించడమే లక్ష్యం. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (డీఎస్ఈఆర్‌టీ) ఎంతో చొరవ చూపింది. కన్నడ, ఇంగ్లీష్, మ్యాథమ్యాటిక్స్, సైన్స్ సోషల్‌సైన్స్ సబ్జెక్టులు సులభంగా బోధించడానికి ఉపాధ్యాయులకు ప్రత్యేక హ్యాండ్ బుక్ రూపొందించారు. అలాగే విద్యార్థులు సులభంగా నేర్చుకోవడానికి వీలుగా ప్రాక్టికల్ బుక్స్ అందుబాటులోకి తెచ్చారు. ఈ విధానం విజయవంతం కావడంతో 27 విద్యాజిల్లాలకు విస్తరింపచేశారు.



ఆరో తరగతి సైన్స్ ప్రాక్టికల్ బుక్



పదో తరగతి గణితం ప్రాక్టికల్‌బుక్

చెరువులన్నీ నింపుతాం

● ఎత్తినహొళెతో తుమకూరు కరువు పారదోలుతాం
● భద్రాకు వాయనం సమర్పించిన డీసీఎం డీకే శివకుమార్



భద్రా డ్యాంకు వాయనం సమర్పిస్తున్న డీసీఎం, కాంగ్రెస్ నాయకులు

బెంగళూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల వర్షాలతో డ్యాంలు జలకళ సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలో శివమొగ్గ జిల్లా లక్కవళ్ళిలోని భద్రా డ్యాంను డీసీఎం, జలవనరులశాఖ మంత్రి డీకే శివకుమార్ శుక్రవారం సందర్శించారు. మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్, ఎంపీ ప్రభా మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. భద్రా నదికి గంగపూజ చేసి, అనంతరం వాయనం సమర్పించారు. తర్వాత కొత్తగా నిర్మించిన అతిథిగృహాన్ని ప్రారంభించారు. అంతకుముందు తుమకూరు జిల్లాలో డీసీఎం పర్యటించారు. సుంకాపురలో టీబీ కెనాల్‌ను 70వ కిలోమీటరు వద్ద హేమావతి లింక్ కెనాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తుమకూరు జిల్లాలోని చెరువులను ఎత్తినహొళె పథకం ద్వారా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లాలోని చెరువులకు నీటిని సమకూర్చామన్నారు. మరింత నీరు సేకరణ సాధ్యమయ్యాక వాటిని తుమకూరు జిల్లా చెరువులకు మళ్లిస్తామన్నారు. ఎత్తినహొళె పథ కం తొలుత తాగునీటికి మాత్రమే నిర్ణయించబడిందని, అయితే నీరు వృథా కాకుండా చెరువులకు మళ్లిస్తున్నట్టు తెలిపారు. ఇందుకుగాను 20వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. డీసీఎం వెంట జలవనరులశాఖ అధికారులు పాల్గొన్నారు.



హేమావతి కాలువను పరిశీలిస్తున్న డీకే

తగ్గిన పూలధరలు

హోసూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పండుగలు, వినాయకచవితి సంబరాలు, శ్రావణ మాస పూజలు తదితర కార్యక్రమాలు ముగిసిపోవడంతో పూలకు డిమాండ్ పడిపోయింది. హోసూరు మార్కెట్‌లో నాలుగైదు రోజులుగా పూలధరలు బాగా తగ్గాయి. ప్రత్యేకించి మల్లెపూలకు కనీస ధర కూడా లేకపోవడంతో తోటలోనే వదిలేస్తున్నారు. ఏడాది పొడవునా మల్లెపూల సాగు ఉంటుంది. హెక్టారుకు 18 టన్నుల వరకు దిగుబడి పొందవచ్చు. ప్రస్తుతం బంతిపూలు కిలో రూ.30, ఫస్ట్‌గ్రేడ్ కిలో రూ.50గా ఉంది. కనకాంబరం రూ.300, మల్లె కిలో రూ.250, రోజ్ రూ.10, బటన్ రోజా రూ.30గా ఉంది.



పొలంలో వదిలేసిన బంతిపూలు

వనసంరక్షణకు ముధోల్ దళం

● శిక్షణ చేపట్టిన అటవీశాఖ ● ట్రైనింగ్ సెంటర్ నుంచి రెండు ప్రత్యేక శునకాలు

బళ్లారి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) ముధోల్ డాగ్స్ ఈపేరు విననివారు ఉండరు. భారత సైన్యం, పారామిలటరీ దళాలు, జాతీయ భద్రత దళం(ఎన్ఎస్‌జీ) తదితర కీలకమైన భద్రతాదళాల్లో వీటిని తప్పనిసరిగా ఉపయోగిస్తారు. దీనికి కారణం అవి కుక్కల్లో రారాజు లాంటివి. బాగల్‌కోట జిల్లా ముధోల్ తాలూకాలో ఉండే ఈ కుక్కలకు చాలా ప్రత్యేకతే ఉంది. ముధోల్ వేగంగా పరుగెత్తగలవు, ఎంతటి పరిస్థితుల్లోనైనా జంకకుండా ప్రాణం పోయేదాకా పోరాడుతాయి. వీటి చూపు, కదలికలు అన్నీ చురుగ్గానే ఉంటాయి. ఇలాంటి ముధోల్ రకం కుక్కలను ఇప్పుడు అటవీశాఖ అధికారులు కూడా రంగంలోకి దించుతున్నారు. అడవి రక్షణకు వీటిని వాడుకోవాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఉండే కొన్ని ఫారెస్టు ఏరియాల్లో ముధోల్‌ను ఫారెస్టు వాచర్లు, బీటర్లు వెంట తీసుకువెళ్లి శిక్షణ ఇస్తున్నారు. శివమొగ్గ జిల్లాలో ఉండే దట్టమైన అడవుల్లో ఎక్కువగా గంధం చెట్లు ఉన్నాయి. సండూరు, పశ్చిమ కనుమల్లో కూడా అధికంగా గంధం చెట్లు అటవీ శాఖ అధికారులు పెంచుతున్నారు. తరచూ గంధం చెట్లను స్మగ్లర్లు నరికి తరలిస్తున్నారు. రాత్రిపూట, వాన కాలం. ఇతర విపత్కర వాతావరణంలో అడవిలో సంచరించడం అటవీశాఖ అధికారులకు అంత సులువు కాదు. ఇలాంటి పరిస్థితుల్లోనే స్మగ్లర్లు చెట్లను నరికి తరలిస్తున్నారు. గంధం చెట్ల పరిర రక్షణ కోసం అటవీశాఖ అధికారులు వినూత్న అలోచన చేశారు. ముధోల్ డాగ్స్‌ను దళంగా వాడాలని భావించారు. ట్రైనర్‌గా ముందుగా రెండు చిన్న చిక్కపిల్లలను ముధోల్ డాగ్ రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సెంటర్ నుంచి గతంలో తెచ్చారు. వాటికి చంద్ర, కాలా అని నామకరణం చేశారు. కొన్ని మాసాలు డాగ్స్ ట్రైనర్‌తో శిక్షణ ఇప్పించారు. ఇప్పుడు అవి అటవీ శాఖలో విస్తృతంగా కాపలా కాస్తున్నాయి. వీటిని అటవీశాఖ అధికారులు వారి వెంట తీసుకురావడం అడవిలో వదిలేస్తే అవి అడవంతా తిరిగి సమాచారం ఇస్తున్నాయి. ఇలా ప్రధానంగా అటవీ సంరక్షణకు ముధోల్ డాగ్స్‌ను రంగంలోకి దించేందుకు అటవీశాఖ అధికారులు కూడా వాటికి ప్రత్యేక శిక్షణ కూడా ఇప్పిస్తున్నారు. సండూరు. శికారీపుర, శివమొగ్గ, ఇతర ప్రాంతాల్లో ఉండే దట్టమైన అడవి రక్షణకు ఈ కుక్కలను వినియోగిస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. ఈ కుక్కలతో కాపలా పకడ్బందీగా చేపట్టామని, స్మగ్లర్ల ఆటకు తెర పడినట్లయ్యిందని పేర్కొన్నారు.



ముధోల్ కుక్కలను వెంట తీసుకెళ్తున్న అటవీ సిబ్బంది





హగరి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదవతి నది

8

నిండుకుండలా వేదవతి

● జోరువానతో జలకళ

ఉన్మాదికి ఉరిశిక్ష

● బాలికపై కిరాతకంగా హత్యాచారం
● దోషికి ఉరి శిక్ష విధించిన మంగళూరు కోర్టు

బెంగళూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న బాలికపై కిరాతకంగా అత్యాచారానికి పాల్పడి దారుణంగా హతమార్చిన వృద్ధుడికి కోర్టు ఉరిశిక్ష విధిస్తూ మంగళూరు జిల్లా సెషన్స్ కోర్టు శుక్రవారం తీర్పును ప్రకటించింది. ఉరిశిక్షకు గురైన వ్యక్తి బెళగావి జిల్లా సవదత్తి ఆలూకా హంచినాళ గ్రామానికి చెందిన పకీరప్ప హనుమప్ప మాదర (58). బెళగావిలోని చించనూరు గ్రామానికి చెందిన బాలిక రెసిడెన్షియల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతుండేవారు. కుమార్తెను రెసిడెన్షియల్ స్కూల్‌లో వదిలి రావాలని తండ్రి బంధువుకు సూచించారు. 2024 ఆగస్టు 6న బాలిక మామ ఇంటికి వెళ్లింది. మామతోపాటు అతడి భార్య ఇంటి నిర్మాణ పనులకు వెళ్లారు. ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేనిసమయంలో పక్కింట్లో అద్దెకు ఉండే పకీరప్ప ఇంట్లోకి ప్రవేశించాడు. లైంగిక దాడికి పాల్పడి ముఖాన్ని కొరికాడు. బాలిక వ్యతిరేకించడంతో విషయం బహిర్గతం అవుతుందని గొంతుకు బట్టతో బిగించి హతమార్చాడు. పణంబూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విచారణలో నేరం రుజువు కావడంతో కోర్టు ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. బాలిక తల్లిదండ్రులకు నిందితుడి నుంచి లక్ష రూపాయల పరిహారం, ప్రభుత్వం నుంచి రూ.4లక్షల పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఉన్మాదికి ఉరి శిక్ష తీర్పుతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.



హుడజాలి గ్రామం వద్ద పొదల్లో ఎలుగుబంటి

8

పొలాల్లో ఎలుగుబంటి

బొలెరో.. లారీ ఢీ

దొరిగిల్లు వాసి మృతి


ఓం ప్రతాప్(ఫైల్)

తనకల్లు, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ్లిపల్లి వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముదిగుబ్బ మండలం దొరిగిల్లుకు చెందిన ఓంప్రతాప్ (35) మృతి చెందాడు. మరో వ్యక్తి ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు ముదిగుబ్బ మండలంలోని దొరిగిల్లుకు చెందిన రైతు ఓంప్రతాప్ వ్యవసాయం చేస్తూనే ఓ బొలెరో వాహనం కొనుగోలు చేశాడు. తాను పండించిన టమోటా పంటను కర్ణాటక రాష్ట్రంలోని చింతామణి సమీపంలో ఉన్న వడ్డిపల్లి మార్కెట్‌కు తరలించేవాడు. అలాగే గ్రామంలో ఇతర రైతుల టమోటాలు కూడా తరలించేవాడు. ఈక్రమంలోనే గ్రామానికి చెందిన రైతు ప్రసాద్ పండించిన టమోటాలను లోడ్ చేసుకుని గురువారం రాత్రి వడ్డిపల్లికి తీసుకెళ్లారు. అక్కడ టమోటాలను అన్‌లోడ్ చేసి, తిరిగి దొరిగిల్లుకు వస్తుండగా తాడిపత్రి నుంచి బెంగళూరుకు సిమెంటును తరలిస్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న ఓంప్రతాప్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను వందేమాతరం అంబులెన్స్‌లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ప్రమాదంలో బొలెరో వాహనం నుజ్జునుజ్జు అయింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, రోడ్డుపై అడ్డంగా పడిన వాహనాలను తొలగించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్టేషన్‌హౌస్ అధికారి నాగసుబ్బయ్య తెలిపారు. మృతుడికి భార్య ఉన్నారు. పిల్లలు లేరు.

త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం

మండ్లిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో మరో పెద్ద ప్రమాదం త్రుటిలో తప్పింది. మండ్లిపల్లికి చెందిన 30మంది మహిళా కూలీలు శుక్రవారం తెల్లవారుజామున ఆటోలో కూలి పనుల కోసం అన్నమయ్య జిల్లాకు బయల్దేరారు. ప్రమాదానికి గురైన లారీ ముందు భాగంలోనే వీరి ఆటో వెళుతోంది. అయితే ఇంతలోనే ఎదురుగా వస్తున్న బొలెరోను లారీ ఢీకొట్టింది. ఏమాత్రం ఏమరుపాటు జరిగినా ఆటోలోని కూలీల ప్రాణాలు గాల్లో కలిసిపోయేవని చెబుతున్నారు.

కుక్క అడ్డురావడంతో..

పరిగి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిగెనహళ్లి గ్రామానికి చెందిన నాగభూషణం(62) అనే వ్యక్తి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. నాగభూషణం మడకశిర మండలం చందకచర్ల గ్రామంలో వ్యవసాయ పనులు ముగించుకుని, బైక్‌పై స్వగ్రామమైన కొడిగెనహళ్లికి వస్తున్నాడు. పరిగి వద్ద ఉన్న ఇండియన్ గార్మెంట్స్ సమీపంలో ఒక్కసారిగా కుక్క అడ్డురావడంతో తప్పించబోయి బోల్తాపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన నాగభూషణంను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

ముగ్గురికి గాయాలు


బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

బెళుగుప్ప, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లి గ్రామ శివార్లలో శుక్రవారం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొలంలో బోల్తా పడింది. దీంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రాయదుర్గం డిపో నుంచి అనంతపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు నక్కలపల్లి, బెళుగుప్ప గ్రామాల మధ్య పొలంలో బోల్తా పడింది. దీంతో బస్సులోని 20 మంది ప్రయాణికులు ప్రాణభయంతో హాహాకారాలు చేశారు. కాగా డ్రైవర్ అప్రమత్తమై ముందున్న బస్సు అద్దాన్ని పగులగొట్టి ప్రయాణికులను రక్షించారు. స్టీరింగ్ పనిచేయదని చెప్పినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదంటూ గ్రామస్థులతో డ్రైవర్ అంజి, కండక్టర్ రమేష్ వాపోయారు. వీరిద్దరితోపాటు ప్రయాణికురాలు సుంకమ్మ స్వల్పంగా గాయపడ్డారు. వీరిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బస్సు బోల్తా విషయం తెలుసుకున్న మంత్రి పయ్యావుల కేశవ్ క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎస్ఐ శివ, ఆర్ఐ నగేష్, వీఆర్వోలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

స్పందించిన రవాణాశాఖ మంత్రి..

ఆర్టీసీ బస్సు బోల్తా పడటంపై రవాణాశాఖమంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు స్పందించారు. ప్రమాదం జరగడం బాధాకరమన్నారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవాలని ఆదేశించారు.

వేధింపులపై కేసు

ధర్మవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన సాయికీర్తనను భర్త నరేశ్, అత్త వెంకటలక్ష్మి వేధిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. రాజేంద్రనగర్‌కు చెందిన సాయికీర్తన, నరేశ్‌లకు నాలుగు సంవత్సరాల క్రితం వివాహమయింది. వీరికి 14నెలల కుమార్తె ఉంది. వివాహమయినప్పటి నుంచి భర్త నరేశ్ వేధించడంతోపాటు కొట్టి గాయపరిచారు. దీంతో ఆమె పుట్టినిల్లు అనంతపురం వెళ్లిపోయింది. శుక్రవారం సాయికీర్తన భర్త, అత్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

రైలు కింద పడి యువకుడి మృతి

గార్లదిన్నె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో వెనుక వైపు శుక్రవారం రైలు కింద పడి శివ (23) అనే యువకుడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. గార్లదిన్నెకు చెందిన రామాంజి కుమారుడు శివ గ్రామంలో కూలీ పనులు చేసుకునేవాడు. మూడు సంవత్సరాలు క్రితం మిద్దెపై నుంచి కిందకు పడడంతో కాలు, చెయ్యి విరిగాయి. అప్పటి నుంచి మానసికంగా ఇబ్బంది పడుతుండేవాడు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తిరుపతి నుంచి గుంతకల్లు వైపు వెళుతున్న రైలుకింద పడి మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వేధించిన వ్యక్తికి దేహశుద్ధి

గోరంట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆమె కుటుంబసభ్యులు మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడికి గురువారం రాత్రి దేహశుద్ధి చేశారు. గోరంట్లలో పని చేస్తున్న మహిళకు టీడీపీ నాయకుడు ఫోన్ చేసి కొన్నిరోజులుగా వేధించేవాడు. అందరి ఫోన్ నెంబర్లు తనకు తెలుసని, తాను చెప్పినట్లు వినాలంటూ వేధిస్తుండేవాడు. విసిగిపోయిన ఆమె విషయాన్ని భర్తకు తెలిపింది. దీంతో బాధిత మహిళ కుటుంబికులు టీడీపీ నాయకుడి కోసం గురువారం పగలంతా గాలించారు. రాత్రి కారులో ఇంటికెళ్తుండగా, కదిరి రహదారిలోని పెట్రోల్ బంక్ వద్ద మరో వాహనంలో వెళ్లి అడ్డగించారు. కిందికు లాగి చితకబాదారు. మరో నాయకుడు అడ్డు రావడంతో అక్కడ నుంచి జారుకున్నాడు. బాధితులు మంత్రి సవితకు నేరుగా ఫోన్‌చేసి, ఇలాంటివారు పార్టీలో ఉంటే మీకు, పార్టీకి మంచిదికాదని చెప్పినట్లు సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో ఆ టీడీపీ నాయకుడి వేధింపుల దారుణాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. దేహశుద్ధి ఘటనపై పోలీసులను విచారించగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

యువతి అదృశ్యం

కదిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ యువతి అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఉదయం యువతి ఇంటిలో ఉన్న చెత్తను బయటకు పడేసి వస్తానని చెప్పి వెళ్లి తిరిగిరాలేదన్నారు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

హ్యాకథాన్ పోటీల్లో సత్తా

బహుమతులు ప్రదానం చేసిన రిజిస్ట్రార్



జేఎన్‌టీయూ టీమ్‌కు బహుమతిని అందజేస్తున్న రిజిస్ట్రార్ కృష్ణయ్య

అనంతపురంరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్-2025 పోటీల్లో జేఎన్‌టీయూఏ ఇంజనీరింగ్ కళాశాలతోపాటు పలు కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. తమ ప్రతిభతో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. జేఎన్‌టీయూ అనంతపురం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్ పోటీలను గురువారం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి వివిధ డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన టాప్-2 జట్లు పాల్గొన్నాయి. మొత్తం 19 జట్లు హాజరయ్యాయి. పది విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీలను జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు ప్రారంభించారు. రాత్రి ముగింపు వేడుకల్లో రిజిస్ట్రార్ కృష్ణయ్య హాజరై పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వాంటం కంప్యూటింగ్ అనేది కొత్తగా మొదలైన ఒక పరిశోధనా అంశం అన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొంటూ మంచి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన జట్లకు రూ.10వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్లకు రూ.5వేలు నగదు బహుమతితోపాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

గెలుపొందిన వారి వివరాలు..

జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఆచార్య కె. మాధవి రెండు టీమ్‌లు మొదటి స్థానంలో నిలిచాయి. ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పల్లవి టీమ్, కర్నూలు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించిన బుక్కిటి, ప్రణవ్ సాయి టీమ్, కర్నూలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల చరణ్, గంగాశ్రీ జట్లు, శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ రామస్వామి టీమ్, రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల బసిద్ టీమ్ మొదటి స్థానంలో నిలిచాయి. అదేవిధంగా శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ రిశిక్ టీమ్, సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సనియా టీమ్, కేవీఆర్ మహిళ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యు.భారతి టీమ్, కర్నూలు జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల హర్షిత టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నాయి.

ఎస్కేయూ విద్యార్థుల ప్రతిభ

క్వాంటం వ్యాలీ హ్యాక్‌థాన్-2025 సెమీస్‌లో విజయం


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): క్వాంటం వ్యాలీ హ్యాక్‌థాన్-2025లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సెమీఫైనల్‌లో రెండు టీమ్‌లు పాల్గొనగా ఇందులో ఒక టీమ్ మొదటి బహుమతి సాధించింది. విద్యార్థులను వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ చంద్రమౌళి అభినందించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులు సెమీఫైనల్ పోటీల్లో విజయం సాధించడంతోపాటు రూ.10వేలు బహుమతి గెలుచుకోవడం అభినందనీయమన్నారు. వీరు అమరావతిలో జరిగే గ్రాండ్ ఫినాలేలో పాల్గొంటారని తెలిపారు. రెండో టీమ్ బెస్ట్ ప్రెజెంటేషన్‌లో కన్సలోషన్ బహుమతి పొంది రూ.5వేలు అందుకుందన్నారు. రెండు టీమ్‌లలో సఫాన్, ధరణి బెస్ట్ ప్రోగ్రామర్స్‌గా ఎన్నుకోబడ్డారన్నారు. విద్యార్థుల విజయంలో సాంకేతిక సహకారం అందించిన అధ్యాపకులు కుల్ దీప్, నరసింహులు, శారద, రాజేష్‌లను వీసీ అభినందించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎస్కేయూ ఔన్నత్యం

- ఎస్కేయూ వీసీ అనిత

అనంతపురంరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఔన్నత్యాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అనిత పిలుపునిచ్చారు. జాతీయ, అంతర్జాతీయ శిబిరాల్లో విజేతలైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పలువురు ప్రొఫెసర్లు శుక్రవారం అభినందించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రాణించడం ప్రశంసనీయమన్నారు. కర్ణాటకలోని మంగళూరులో రెండు రోజుల పాటు జరిగిన ఐకాన్ అంతర్జాతీయ శిబిరంలో పాల్గొని మూడు ఈవెంట్లలో హిందూపురం ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని మదీహ విజేతగా నిలిచిందన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా విభాగంలో రాష్ట్ర సమాచార కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన పోటీలలో సైతం రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించడం అభినందనీయమన్నారు. కర్ణాటకలోని బెళగావిలో రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో వివిధ ఈవెంట్లలో వెంకటసాయి(ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల), వినూతలక్ష్మి(బాలయేసు డిగ్రీ కళాశాల హిందూపురం), గౌతమిశ్రీ(ఎస్‌వీడిగ్రీ కళాశాల అనంతపురం), దీపిక (కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనంతపురం), గిరివర్ష(బాలాజీ డిగ్రీ కళాశాల హిందూపురం) రామమూర్తి (కేటీఎస్‌ప్రభుత్వ డిగ్రీకళాశాల రాయదుర్గం), సుబ్రహ్మణ్యం(పీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెనుకొండ), గణేష్(ఎస్కేయూ కాలేజీ ఆఫ్ ఫార్మసూటికల్ సైన్స్ ఎస్కేయూ), గదిలింగప్ప(ఎస్కేపీ డిగ్రీ కళాశాల గుంతకల్లు), స్వాతి బాయి(ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల హిందూపురం) విజేతలు నిలవడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ సమైక్యత శిబిరానికి, ఐకాన్ అంతర్జాతీయ సదస్సుకు ఏపీ టీం కంటింజెంట్ లీడర్‌గా వ్యవహరించిన హిందూపురం ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులను ఈసందర్భంగా వీసీ అభినందించారు. కార్యక్రమంలో ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ మురళీధర్ రావు పాల్గొన్నారు.

వైసీపీ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతి


నివాళులు అర్పిస్తున్న అనంత వెంకటరామి రెడ్డి


తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి(ఫైల్)

అనంతపురం కలెక్టరేట్/ఆత్మకూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి(70) మృతి చెందారు. శుక్రవారం ఆత్మకూరు మండలం తోపుదుర్తిలోని పొలంలో పనులు చేయిస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో కింద పడిపోయారు. వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. భాస్కర్‌రెడ్డి సుదీర్ఘకాలం కాంగ్రెస్‌పార్టీలో పనిచేశారు. ఆత్మకూరు మండల ఎంపీపీగా పనిచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి సతీమణి తోపుదుర్తి కవిత జడ్పీ ఛైర్‌పర్సన్‌గా పనిచేశారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి దంపతులు ఆ పార్టీలో చేరారు. భాస్కర్‌రెడ్డి మృతదేహాన్ని నగరంలోని రామచంద్రనగర్‌లోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నివాళి అర్పించారు. భాస్కర్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపీ రంగయ్య, గంగుల భానుమతి, మధుసూదన్‌రెడ్డి తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. భాస్కర్‌రెడ్డికి కుమార్తె, కుమారుడు సంతానం.

గాయపడిన మహిళ మృతి

తలపై రాడ్డుతో బాదిన భర్త

చికిత్స పొందుతూ మృత్యువాత


మృతురాలు సుమియా, భర్త అల్తాఫ్‌ఖాన్ (ఫైల్)

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): భర్త దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ శుక్రవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు పెనుకొండలోని కుమ్మరదొడ్డిలో నివాసముంటున్న ఇక్బాల్‌సాబ్, పర్వీన్‌ల కుమార్తె సుమియాబేగం(25)ను అదే వీధిలో నివాసముంటున్న అల్తాఫ్‌ఖాన్ ఏడేళ్ల కిందట ప్రేమించి, పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత ఎనిమిది నెలల నుంచి కుటుంబ కలహాలతో దంపతులిద్దరూ విడిగా ఉంటున్నారు. మృతురాలు సుమియాబేగం స్థానిక ఘనగిరి పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 26న పాఠశాలలోనే భార్యతో గొడవపడిన అల్తాఫ్‌ఖాన్ పిల్లలను తన నివాసానికి తీసుకెళ్లాడు. పిల్లలను ఏదైనా చేస్తాడన్న భయంతో సుమియా బేగం అక్కడికి వెళ్లింది. ఆ సమయంలో ఇద్దరి మధ్య గొడవ తీవ్రం కావడంతో అల్తాఫ్‌ఖాన్ ఇనుపరాడ్డుతో సుమియా తలపై బలంగా మోదాడు. దీంతో ఆమె అపస్మారక స్థితిలో పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భర్త అల్తాఫ్‌ఖాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పెండింగ్ పనులు వేగవంతం చేయాలి

- ఎస్ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ నీటిసరఫరా విభాగం ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్నవాటిని వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ ఆదేశించారు. శుక్రవారం గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ కార్యాలయంలో ఈఈ శ్రీనివాసులుతో కలిసి జిల్లాలోని డీఈలు, ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాప్తాడు, శింగనమల డివిజన్‌లలోని పలు మండలాల్లో చోటు చేసుకున్న సమస్యలపై సంబంధిత ఏఈలకు క్లాస్ తీసుకున్నట్లు తెలిసింది. వెంటనే పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానంగా స్వచ్ఛభారత్ పనుల్లో భాగంగా చేపడుతున్న మరుగుదొడ్లు, అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణంతో పాటు వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేసి పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఈలు శ్రీరాములు, శ్రీధర్, రేహాన వసీం, చంద్రశేఖర్, కిరణ్ తేజ, రాంగోపాల్‌రెడ్డి, ఏఈలు శ్రీనివాసులు, హరికుమార్, శివకుమార్, వరలక్ష్మి, రవీంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మన్న, నాగేంద్ర, జనార్దన్, సుప్రజారెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ జనాభాను అనుసరించి రిజర్వేషన్లు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ డిమాండ్

గుంతకల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనగణనతో పాటు కుల గణన కూడా చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి. జగదీశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సీట్లను కుదించారని అన్నారు. తెలంగాణాలో మాదిరిగా కుల గణన చేపట్టి, జనాభా లెక్కలను అనుసరించి బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం కూడా జనగణనతోపాటుగా కుల గణన చేపడతామని ప్రకటించినందున.. ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు కులగణన చేయాలన్నారు. దీనిపై ఈ నెల 14న విజయవాడలో అఖిలపక్ష పార్టీలు, కుల సంఘాల నేతలతో సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్, సూపర్ హిట్ సదస్సులో బీసీల జపం చేసి, వారి రాజకీయ రిజర్వేషన్లపై ఏమీ చెప్పలేదన్నారు. చంద్రబాబు ప్రస్తుతం ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారని అన్నారు. విద్య, వైద్య రంగాలను పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అప్పగించే ఆలోచనలో ఉన్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో సీపీఐ నాయకులు బి. గోవిందు, బి.మహేశ్, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, రాయల్ రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీశ్

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రన్నింగ్‌లో మార్పు

గుంతకల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా వెళ్లే కాచిగూడ-యశ్వంతపూర్-కాచిగూడ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20703/04) రైళ్ల రన్నింగ్ నమూనాను మార్చినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లు వారానికి ఆరు రోజులు నడుస్తున్నాయి. బుధవారం మినహా మిగిలిన ఆరు రోజులు రాకపోకలు సాగిస్తున్నాయి. డిసెంబరు 4వ తేదీ నుంచి బుధవారానికి బదులు శుక్రవారం తప్ప ఇతర రోజుల్లో ఈ రైళ్లు నడుస్తాయని పేర్కొన్నారు.

16 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 16 మండలాల్లో గురువారం వర్షం కురిసింది. అత్యధికంగా గుత్తి మండలంలో 27.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. పెద్దవడుగూరు 9.0, పుట్లూరు, నార్పల 6.4, గుంతకల్లు, వజ్రకరూరు 6.2, తాడిపత్రి 4.2, విడపనకల్లు 4.0, పెద్దపప్పూరు, బుక్కరాయసముద్రం 3.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 2.4 మి.మీలోపు వర్షం కురిసింది. శుక్రవారం జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. గుంతకల్లులో ఓ మోస్తారు వర్షం పడింది. యాడికి, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

1130 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఇఫ్‌కో కంపెనీకి చెందిన 1130 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద వ్యాగిన్లలో వచ్చిన యూరియా బస్తాలను ఏడీఏ శుక్రవారం పరిశీలించారు. జేసీ ఆదేశాల మేరకు... ఏపీ మార్క్‌ఫెడ్‌కు 580, సొసైటీలకు 220, ప్రైవేటు డీలర్లకు 330 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామన్నారు.

జాబ్ మేళా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 15మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉపాధి కల్పన జిల్లా అధికారి పల్లవి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతపురం ఎంజీ బ్రదర్స్ హెచ్‌పీసీఎల్‌లో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఉపాధి కల్పన కార్యాలయ అధికారులు, ఎంజీ బ్రదర్స్ కంపెనీ ప్రతినిధులు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

15 నుంచి విద్యుత్ జేఏసీ ఆందోళనలు


ఎస్ఈకి వినతి పత్రం ఇస్తున్న విద్యుత్ జేఏసీ నాయకులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ దశలవారీ ఆందోళనలకు సిద్ధమైంది. ఈనెల 15నుంచి ఆందోళనలు చేపట్టనున్నారు. ఆ మేరకు జిల్లా విద్యుత్ జేఏసీ నాయకులు విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్‌కు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15, 16 తేదీల్లో ఉద్యోగులంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారన్నారు. 17, 18న అన్ని సర్కిల్ కార్యాలయాలు, జనరేటింగ్ స్టేషన్ల ఎదుట భోజన విరామ సమయంలో ధర్నాలు చేస్తామన్నారు. 19, 20న సర్కిల్ ఆఫీసులు, జనరేటింగ్ స్టేషన్ల ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామన్నారు. 22న జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు నోటీసుల్లో పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ జి.టి. శ్రీనివాసులు, కో కన్వీనర్ రాఘవేంద్ర హర్ష, వైస్ ఛైర్మన్ కళ్యాణచక్రవర్తి, నాయకులు నాగార్జున, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా భవానీ రవికుమార్ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న భవానీ రవికుమార్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్ శుక్రవారం స్వచ్ఛ ఆంధ్రమిషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ రాష్ట్ర ఛైర్మన్ పట్టాభిరామ్, మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన భవానీ రవికుమార్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆంధ్ర మిషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా బాధ్యతలను ప్రణాళిక ప్రకారం నిర్వర్తించి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తా అన్నారు. అనంతరం అనంతపురం నుంచి వెళ్లిన అభిమానులు, జనసేన పార్టీ నాయకులు భవానీ రవికుమార్‌తో కలిపి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, స్వచ్ఛ ఆంధ్రమిషన్ రాష్ట్ర ఛైర్మన్ పట్టాభిరామ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, పలువురు కూటమి నాయకులు, చిరంజీవి యువత పెద్ద ఎత్తున హాజరై అభినందనలు తెలిపారు.

జిల్లా ప్రజల ప్రేమ మరువలేనిది

● బదిలీ అయిన కలెక్టర్ టీఎస్ చేతన్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఆర్డీఓలు, ఉద్యోగులు

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల ప్రేమాభిమానాలు మరవలేనివని బదిలీ అయిన కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయన్ను రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, సిబ్బంది, అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తాను కలెక్టర్‌గా పనిచేసిన 14నెలల కాలంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మద్దతుతో అనేక అభివృద్ధి పనులు విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. తనకు సహకరించిన ప్రతి ఒకరికి కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కలెక్టర్ సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ కలెక్టర్ సత్యసాయి శతజయంతి ఉత్సవాల వరకు పనిచేసి ఉంటే బాగుండేదన్నారు. అయినా జిల్లా అభివృద్ధికి ఆయన తనదైన ముద్ర వేశారన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, ఆర్డీవోలు సువర్ణ, వీవీఎస్ శర్మ, మహేష్, ఆనంద్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, జిల్లా రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

రోల్డ్ డాల్ (జయంతి)



బ్రిటీష్ నవలా రచయిత, చిన్నకథల రచయిత రోల్డ్ డాల్ 1916 సెప్టెంబరు 13న జన్మించారు. కవిగా, స్క్రీన్ రైటర్‌గా రాణించారు. 20వ శతాబ్దంలో పిల్లల కథలు చెప్పడంలో పేరొందారు. రెండో ప్రపంచయుద్ధంలో రాయల్ ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేశారు. ఆయన రచనలు ప్రపంచవ్యాప్తంగా 250 మిలియన్‌లకు పైగా అమ్ముడయ్యాయి. 'వరల్డ్ ఫాంటసీ అవార్డ్ ఫర్ లైఫ్ అచీవ్‌మెంట్, బ్రిటీష్ బుక్ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. 1990 నవంబరు 23న కన్నుమూశారు.

మణక్కల్ రంగరాజన్ (జయంతి)



కర్ణాటక సంగీత గాయకులు మణక్కల్ రంగరాజన్ 1922 సెప్టెంబరు 13న తమిళనాడు రాష్ట్రం తిరుచ్చి జిల్లా మణక్కల్ ప్రాంతంలో జన్మించారు. అరుదైన రాగాలు, పల్లవిలు ఆలపించడంలో నిష్ణాతులు. 60ఏళ్ళపాటు త్యాగ రాజ సంగీత ఉత్సవంలో కృతులు ఆలపించారు. ఆలిండియా రేడియో చెన్నైలో నాన్‌స్టాప్‌గా పాటలు పాడారు. కళైమామణి, గాన కళారత్న, గానకళా సాగర, ఉగాది పురస్కార్, గాయక సామ్రాట్ వంటి పురస్కారాలు పొందారు. 2019 ఫిబ్రవరి 26న కన్నుమూశారు.

ఆత్రేయ (వర్ధంతి)




'మనసు కవి'గా పేరొందిన ఆచార్య ఆత్రేయ 1921 మే 7న నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట మండలం మంగళంపాడులో జన్మించారు. ఆయన అసలు పేరు కిళాంబి వెంకట నరసింహాచార్యులు. తెలుగులో నాటక, సినిమా పాటల రచయిత, నిర్మాత, దర్శకులు. సుమారు 400 సినిమాలకు మాటలు, పాటలు రాశారు. గొప్ప వేదాంతి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆత్రేయ రాసిన రచనలను 7 సంపుటాలలో ప్రచురించిన ఆప్తమిత్రుడు కొంగర జగ్గయ్య ఆయనకు నివాళిగా అర్పించారు. నంది పురస్కార, ఆంధ్ర నాటక పరిషత్ తదితర గౌరవాలు అందుకున్నారు. విశ్వశాంతి నాటకానికి రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. 1989 సెప్టెంబరు 13న స్వర్గస్తులయ్యారు.

ప్రభా ఆత్రే (జయంతి)



'పద్మభూషణ్' పురస్కార గ్రహీత డాక్టర్ ప్రభా ఆత్రే 1932 సెప్టెంబరు 13న పూనెలో జన్మించారు. హిందూస్తానీ గాయనంలో ప్రత్యేకించి 'కిరానా ఘరానా'లో పేరొందారు. 50 ఏళ్లలో ఆమె పలు కొత్త రాగాలను ఆవిష్కరించారు. ఖ్యాల్ లేదా ఖయాల్, తుమ్రి, దాద్రా, గజల్, గీత్, నాట్యసంగీత్, భజన్ తదితర అన్ని రకాల పాటలు ఆలపించారు. ప్రొఫెసర్‌గా సంగీతంపై 11 పుస్తకాలు రచించారు. గానప్రభ, స్వరమయీ, ఠాగూర్ అకాడమీ రత్న అవార్డ్, కాళిదాస్ సమ్మాన్ పురస్కారాలు అందుకున్నారు. 2024 జనవరి 13న కన్నుమూశారు.

షేన్ వార్న్ (జయంతి)



ఇంటర్నేషనల్ మాజీ క్రికెటర్, ఆస్ట్రేలియా క్రికెట్ కామెంటేటర్, షేన్ కీత్ వార్న్ 1969 సెప్టెంబరు 13న జన్మించారు. వన్డే ఇంటర్నేషనల్స్‌లో ఆస్ట్రేలియన్ నేషనల్ టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించారు. క్రికెట్ చరిత్రలో గొప్ప బౌలర్‌గా పేరొందారు. 1994లో 'విజ్డన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, 1997లో విజ్డన్ లీడింగ్ క్రికెటర్ ఇన్ ది వరల్డ్‌గా నిలిచారు. ఇంటర్నేషనల్ క్రికెట్‌లో వెయ్యి వికెట్‌లు తీసిన ఘనత ఆయనది. ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేంలో గుర్తింపు పొందారు. ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 2022 మార్చి 4న కన్నుమూశారు. మరణానంతరం 'ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా' గుర్తింపు ప్రకటించారు.

కిరణ్ కుమార్ రెడ్డి (పుట్టినరోజు)



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చివరి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి 1960 సెప్టెంబరు 13న హైదరాబాద్‌లో జన్మించారు. చిత్తూరు జిల్లా (ప్రస్తుతం అన్నమయ్య జిల్లా) వాయల్పాడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిత్యం వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్‌గా, శాసనసభ స్పీకర్‌గా వ్యవహరించారు. 'మీ సేవ', రాజీవ్ యువకిరణాలు, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్, బంగారు తల్లి, మన బియ్యం, అమ్మ హస్తం, చిత్తూరు వాటర్ స్కీమ్ వంటి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే. అంతేకాక రాష్ట్రం తరపున రంజీ క్రికెట్ మ్యాచ్‌లకు ప్రాతినిత్యం వహించారు. వివాదాలు లేని రాజకీయ జీవితం, కీలక సందర్భాలలో కఠిన నిర్ణయాలు తీసుకునే మనస్తత్వంతో ఉన్నత హోదాలలో కొనసాగారు. 2023 ఏప్రిల్‌లో బీజేపీలో చేరారు.

వీధి కుక్కల పట్టివేత

పెనుకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కుక్కల బెడద ఎక్కువైందని ప్రజల నుంచి పిర్యాదులు రావడంతో వాటి పట్టివేతకు చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం పుట్టపర్తిలోని కరుణా సొసైటీ ఆధ్వర్యంలో కుక్కలను పట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కరుణా సొసైటీవారు పట్టిన వీధికుక్కలను పుట్టపర్తిలో కుని ఆపరేషన్లు చేయించి ఏడు రోజుల తరువాత వ్యాక్సినేషన్ చేయించి తిరిగి వదిలేయడం జరుగుతుందన్నారు.

సేవ్ ఆర్డీటీ కరపత్రాలు విడుదల

పెనుకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 15న జరగనున్న సేవ్ ఆర్డీటీకి సంబంధించి పోస్టర్లను దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు శుక్రవారం విడుదల చేశారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఐక్యవేదిక నాయకులు రామాంజినేయులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, మూర్తి ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. సేవ్ ఆర్డీటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి, ఉద్యోగాల నెలవు మైసూరు

▸▸ ఎంపీ యదువీర్

బెంగళూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మైసూరు ప్రాంతం పరిశ్రమలకు పేరొందిందని దశాబ్దాలకాలం క్రితమే ఇక్కడ ఉపాధి, ఉద్యోగాలు లభించాయని ఎంపీ యదువీర్ అభిప్రాయపడ్డారు. టైటాన్ వాల్వ్స్ 50వ వార్షికోత్సవంలో ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టైటాన్ వాల్వ్స్ మైసూరులో ప్రారంభమైన సంస్థ అని దేశ విదేశాలలోనూ పేరొందిందన్నారు. ఒక పరిశ్రమ ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకుందంటే కేవలం లాభాలే కాకుండా నాణ్యత, కాలానికి అనుగుణంగా ప్రగతితోనే సాధ్యమన్నారు. టైటాన్ అందరికీ



ఎంపీ యదువీర్

మేక్ ఇన్ ఇండియా శక్తి, నమ్మకానికి ప్రతిరూపమన్నారు. ఇదే సందర్భంగా ప్రముఖ రచయిత రూపాపై రచించిన కోర్ స్ట్రెంగ్త్ అనే ప్రత్యేక సంచికను విడుదల చేశారు. ఇన్ఫోసిస్ కో-ఫౌండర్ నందన్ నీలేకణి, ఏథర్ ఎనర్జీ కో-ఫౌండర్ స్వప్నిల్ జైన్, ఆదిత్య ఎం గోకర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డీపీటీ టీకాలు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బూదాళిగేట్ సమీపాన గల రాయల్ పబ్లిక్ పాఠశాలలో డీపీటీ టీకాలు వేశారు. మూడు రకాల బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్‌లనుంచి టీకా కాపాడుతుందని వైద్యులు తెలి పారు. (డిఫ్తీరియా, పెర్టుసిస్ అండ్ టెటనస్) డీపీటీ వ్యాక్సిన్ వల్ల తీవ్రమైన దగ్గు, గొంతు సమస్యల నియంత్రణ సాధ్యమన్నారు. ఒకవేళ సోకినా త్వరగా నయమయ్యే వీలుందన్నారు. పాఠశాల ముఖ్యులు దేవరాజ్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో జలుబు, జ్వరం, దగ్గు వంటివి త్వరగా ప్రబలే అవకాశం ఉందని, టీకాల ద్వారా ఆరోగ్యరక్షణ సాధ్యమన్నారు. ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ ఆసుపత్రి నర్సులు పర్యవేక్షించారు.




క్యూలో వేచి ఉన్న విద్యార్థులు

పెళ్లికి నిరాకరించిందని... యువతిపై దాడి

బెంగళూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పెళ్లికి నిరాకరించిందని యువతిపై యువకుడు చాకుతో దాడి చేసిన సంఘటన ఉడుపి జిల్లా బ్రహ్మావర తాలూకాలో చోటు చేసుకుంది. కొక్కర్ణె గ్రామం బస్టాండ్‌లో శుక్రవారం ఘటన జరిగింది. గాయపడిన 24ఏళ్ల యువతిని స్థానికులు మణిపాల్ కస్తూర్బా ఆసుపత్రిలో చేర్పించారు. పెళ్లి చేసుకోవాలంటూ యువతిపై 27ఏళ్ల కార్తీక్ ఒత్తిడి తెచ్చేవాడని తెలుస్తోంది. ఇందుకు యువతి నిరాకరించడంతో ఇద్దరిమధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆవేశానికి లోనైన యువకుడు చాకుతో గొంతు, ఛాతీపైన గాయపరిచాడు. ఎక్కువ రక్తస్రావం కావడంతో యువతి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. బ్రహ్మావర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఉడుపి జిల్లా ఎస్పీ హరిరామ్ శంకర్ మీడియాతో మాట్లాడుతూ యువతి పుట్టినరోజు అని, ఉదయం సుమారు 8.30 గంటలకు బస్టాండ్‌కు నడిచి వెళ్తుండగా యువకుడు బైక్‌పై వచ్చి అడ్డుకుని ఒక్కసారిగా చాకుతో గాయపరిచినట్లు ప్రాథమికంగా తెలుస్తోందన్నారు. యువతి, ఆమె తల్లిదండ్రులు కూడా యువకుడితో వివాహానికి అంగీకరించలేదన్నారు. యువకుడి ఫోన్ నెంబరు యువతి బ్లాక్ చేసిందనే కోపంతోనే యువకుడు దాడికి పాల్పడ్డాడన్నారు.

మునీశ్వర లే అవుట్‌లో గణేశ ఉత్సవం

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేవరచిక్కనహళ్ళి రోడ్డు మునీశ్వర లే అవుట్‌లో వినాయకుడిని కొలువుదీర్చి లోక కల్యాణార్థం సుమారు 22 అడుగుల ఎత్తైన ప్రత్యేక వినాయకుడికి పూజలు చేశారు. బొమ్మన హాళ్ళి కేపీ రాజా యువజనసంఘం అధ్యక్షుడు ముకేశ్‌నాయుడు మాట్లాడుతూ గణపతి, శాంతిహోమం నిర్వహించినట్లు తెలిపారు. ఐదోరోజు ఆదివారం నిమజ్జన ఊరేగింపు భారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాలనుంచి కళాకారులు పాల్గొంటారన్నారు. మైసూరు సెట్టింగ్‌లతో అలంకరణ చేశారు. శుక్రవారం భక్తి కచేరీ, చిన్నారులకు పాటల పోటీలు నిర్వహించారు. శనివారం 45మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 16 సంవత్సరాలుగా సంఘం ఆధ్వర్యంలో ఏటా గణేశ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఇదేతొలిసారి భారీగా సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



పూజలలో పాల్గొన్న భక్తులు

దయానందసాగర్ వర్సిటీలో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

బెంగళూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హారోహళ్ళిలోగల దయానందసాగర్ యూనివర్సిటీలో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయదలిచారు. సుమారు 60వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 100 కోట్ల రూపాయలతో కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు ప్రొ-చాన్స్‌లర్ ప్రేమానంద సాగర్ ప్రకటనలో తెలిపారు. జనరేటివ్ ఏఐ, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్, హెల్త్‌కేర్ వంటిపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఏఆర్/వీఆర్, ఇమ్మర్సివ్ టెక్నాలజీస్, ఇంటెలిజెంట్ మొబిలిటీ: ఎలక్ట్రిక్, అటానమస్, ఎస్ఎల్‌పీ, కంప్యూటర్ విజన్, డేటా అనలిటిక్స్ వంటివి అందుబాటులోకి తెస్తామన్నారు. యూనివర్సిటీకి న్యాక్ ద్వారా ఏ+ గుర్తింపు ఉందన్నారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు యూనివర్సిటీకి నీతి ఆయోగ్‌తోపాటు ఎన్‌విడియా, బోష్ ఇటాస్, రెక్స్‌రోత్, జిఇ, ఆటోడెస్క్, ఐబీఎ, అనలాగ్ డివైజెస్ వంటి సంస్థలతో ఒప్పందం ఉందన్నారు.

అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలి

● కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వినాయక్ సోరాక్

హోస్పేట,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి పనుల గురించి సామాన్య ప్రజలకు తెలియచేయాలని కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వినాయక్‌సోరాక్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.5 శాతం అభివృద్ధి పనులలో 95శాతం తాము చేశామని ఇతర పార్టీలు చెబుతున్నాయని, మనం చేసిన 95శాతం పనుల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆమె కుటుంబం ప్రాణాలు కోల్పోయినప్పటికి నేటికి వారి ఏకైక కుమారుడు అయిన రాహుల్ గాంధీ దేశ సంక్షేమం కోసం కష్టపడి పనిచేస్తున్నట్లు మనం చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హుడా అధ్యక్షుడు ఇమామ్ నియాజీ, మంజునాథ్; యశోద మురళి, సయ్యద్ మహ్మద్, వెంకటరమణ పాల్గొన్నారు.



15 నుంచి మైనారిటీలు, మాజీ దేవదాసీలపై సర్వే

●పోస్టర్లు విడుదల చేసిన జస్టిస్ హెచ్ఏ సాత్విక్

రాయచూరు సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి లింగ మైనారిటీలు, మాజీ దేవదాసి మహిళల పై సర్వే సెప్టెంబరు 15న ప్రారంభం కానున్న నేపథ్యంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి హెచ్ఏ సాత్విక్ శుక్రవారం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో సర్వేకు సంబంధించిన అవగాహన పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నవీన్ కుమార్, కర్ణాటక రాష్ట్ర మహిళా అభివృద్ధి కార్పొరేషన్ రాయచూరు అభివృద్ధి అధికారి చామరాజ, దేవదాసి పునరవాస ప్రాజెక్టు శిశు సంక్షేమ ప్లానింగ్ ఆఫీసర్ నాగరాజ్, అసిస్టెంట్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



సర్వే అవగాహన పోస్టర్‌లను విడుదల చేస్తున్న న్యాయాధికారి హెచ్ఏ సాత్విక్

అడుగు పడింది..!

మందుగుండు సామగ్రి పరిశ్రమ ఏర్పాటులో కీలక పరిణామం

ఎన్ఎస్ఈకి లేఖ రాసిన ఆగ్నేయాస్త్ర ఎనర్జెటిక్స్ లిమిటెడ్

ఆర్ అనంతపురం వద్ద ఏర్పాటుకానున్న పరిశ్రమ

మడకశిర టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మడకశిర ప్రాంతంలో ఏపీఐఐసీ నుంచి భూమి కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు నేషనల్ స్టాక్ ఎక్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) కు ఈనెల 4న భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ అయిన ఆగ్నేయాస్త్ర ఎనర్జెటిక్స్ లిమిటెడ్ అధికారికంగా తెలియజేసింది. దీంతో మందుగుండు సామగ్రి పరిశ్రమ ఏర్పాటుకు ముందుడుగు పడినట్లైంది. మడకశిర సమీపంలోని ఆర్.అనంతపురం వద్ద ఆగ్నేయాస్త్ర ఎనర్జెటిక్స్ లిమిటెడ్ మందుగుండు భారీ పరిశ్రమ ఏర్పాటు చేయనున్న విషయం తెలిసిందే. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటికే ఒప్పందం కూడా కుదిరింది. ఈనేపథ్యంలో ఆ సంస్థకు ఆర్ అనంతపురం వద్ద 949.65 ఎకరాలు కేటాయించేందుకు ఏపీఐఐసీతో ఒప్పందం కుదిరింది. ఈమేరకు రూ.2400 కోట్లతో అత్యాధునిక రక్షణ రంగ ఉత్పత్తుల కేంద్రం ఇక్కడ ఏర్పాటు కానుంది. ఈ పరిశ్రమలో క్షిపణులు, రాకెట్లు, ఫిరంగి గుండ్లతో పాటు మందుగుండు సామగ్రి నింపే ప్లాంట్, గన్‌ప్రొపెల్లెంట్ సౌకర్యం, క్షిపణి వ్యవస్థలు, అంతరిక్ష ప్రయోగ వాహనాలు తయారు చేయనున్నారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 550మందికి, పరోక్షంగా 1000మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇక్కడ తయారైన రక్షణ రంగ ఉత్పత్తులను దేశీయ అవసరాలకే కాక ప్రపంచ దేశాలకు సైతం ఎగుమతి చేయనున్నారు. దీంతో ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరిశ్రమలు తెస్తామన్న హామీ కూడా నెరవేరినట్లు అవుతోంది. త్వరలోనే పరిశ్రమ ఏర్పాటుకు భూమి పూజ చేయనున్నట్లు సమచారం. ఇప్పటికే పరిశ్రమ ఏర్పా టు చేసే ప్రాంతంలో భూమిని చదును చేస్తున్నారు. దీంతో పనుల ప్రారంభానికి త్వరలో తేదీలు ఖరారు కానున్నట్లు సమాచారం.



పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతంలో భూమిని చదును చేస్తున్న దృశ్యం



ఆర్. అనంతపురం వద్ద ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్క్

నిరుద్యోగులకు వరం



మా గ్రామ సమీపంలో మందుగుండు భారీ పరిశ్రమ ఏర్పాటు కావడం సంతోషంగా ఉంది. ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న సమయంలో ఇలాంటి పరిశ్రమలు మా ప్రాంతంలో ఏర్పాటు కావడం మాలాంటి వాళ్ల అదృష్టంగా భావిస్తున్నాం. పారిశ్రామిక అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు వల్ల సాధ్యపడుతుందని మాలాంటి నిరుద్యోగ యువత విశ్వసిస్తోంది. మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసి మాలాంటి నిరుద్యోగులకు ఉపాధిని స్థానికంగా కల్పించాలి.

- పీఆర్ మురళిబాబు, జమ్మానిపల్లి

వడిసలమ్మకు ప్రత్యేక పూజలు

మడకశిర టౌన్, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరాపురం బస్టాండ్ ఆవరణంలో వెలసిన వడిసలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అదే విధంగా పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి విశేషంగా పూజలు చేశారు. కొల్హాపురమ్మ, గంగాభవాని, పూజమ్మ, మూలకంతేశ్వరి తదితర ఆలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

డ్రైనేజీ కాలువ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కాంప్లెక్స్ క్రాస్‌రోడ్డు నుంచి ట్రెడ్స్ షోరూం వరకు డ్రైనేజీ కాలువ ఏర్పాటుకు టీడీపీ నాయకులు శుక్రవారం భూమి పూజ చేశారు. రూ. 30లక్షల నిధులతో ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు సోముశేఖర్, నాగేనాయక్, నిమ్మల విద్యాధరణి, నిమ్మల శ్రీధర్, ఉమ్మర్‌ఖాన్, రామచంద్రారెడ్డి, శీనా, గిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

రూ.లక్షలు ఖర్చు చేసి వదిలేస్తున్న వైనం



నిరుపయోగంగా కమర్షియల్ సేల్స్ ట్యాక్స్ కార్యాలయం

చిలమత్తూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవలు అందించేందుకు నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాటివైపు చూసేవారు కరువవ్వడంతో మట్టిపాలు అవుతున్నాయి. మండలంలో ఇలాంటి భవనాలు పదుల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. గతంలో వాణిజ్య పన్నుల శాఖకు చెందిన కార్యాలయం కొడికొండ చెక్‌పోస్టులో ఉండేది. దాని కోసం ప్రభుత్వం పక్కా భవనాన్ని లక్షల ఖర్చు చేసి నిర్మించింది. అయితే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ అమల్లోకి తీసుకురావడంతో ఆ కార్యాలయ నిర్వహణను ఆపేశారు. గత 8 ఏళ్లుగా ఈ భవనం మూతపడింది. అప్పటి నుంచి ఈ భవన చూసేవారు లేకపోవడంతో ఇప్పుడు ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. లక్షల ఖర్చు చేసిన ఈ భవనం ఇతర సేవలకు ఉపయోగించుకొని ఉంటే శిథిలావస్థకు చేరుకునేది కాదు. కానీ ఆ దిశగా అధికారులు చరర్యలు తీసుకోకపోవడంతో ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. అదేవిధంగా ఒకప్పుడు కొడికొండ చెక్‌పోస్టుకి ఐకాన్‌గా నిలిచిన ఏపీ టూరిజం హరిత రెస్టారెంట్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. 2005లోనే రూ. 60 లక్షలతో నిర్మించిన భవనం ఇప్పుడు శిథిలమవుతోంది. ఇలా చెప్పుకుంటూ పోతే మండలంలో పదుల సంఖ్యలో మంచిగా ఉన్న భవనాలు ఆలనాపాలన కరువవడంతో శిథిలమవుతున్నాయి. కొడికొండ చెక్‌పోస్టులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, బలిజపల్లి, నంజిరెడ్డిపల్లి, సుబ్బరావుపేట, ముద్దప్పలి, వై.గొళ్లపల్లి, దాదిరెడ్డిపల్లి తండా, మాదిరెడ్డిపల్లి గ్రామాల్లో మూతపడిన భవనాలు ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండల కేంద్రంలోని విద్యుత్ శాఖకు సంబంధించిన వసతి గృహాలు, పోలీస్ శాఖకు సంబంధించిన వసతి గృహాలు శిథిలమయ్యాయి. దీంతో కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం వృథా అవుతోంది. ప్రజలకు సేవలు అందివ్వడం కోసం నిర్మించిన భవనాలు కళ్లెదురుగానే పాడవుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వాటిపై దృష్టి పెట్టి ప్రభుత్వ భవనాలను ప్రజాసేవ నిమిత్తం ఉపయోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ప్రత్యామ్నాయాలకు ఉపయోగించాలి

ప్రజా అవసరాల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు కొన్ని కారణాలతో మూతపడ్డాయి. అయితే ఆ భవనాలను అలాగే వదిలేయకుండా వాటిని ఇతర ప్రత్యామ్నాయ అవసరాలకు ఉపయోగిస్తే మంచిదని పలువురు పేర్కొంటున్నారు. ఉన్న భవనాలను అలాగే వదిలేస్తే శిథిలమవడం తప్ప ఏ మాత్రం ఉపయోగం ఉండదని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఏ శాఖకు అవసరమైనా వాటిని ఉపయోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందని అంటున్నారు.

ప్రజా సమస్యలపై చర్చ ఏదీ..?

హడావుడిగా ముగిసిన సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరత్నమ్మ

లేపాక్షి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వెంకటరత్నమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, హాజరయ్యారు. సమావేశం 11.30గంటలకు ప్రారంభమై 12గంటలకు ముగించేశారు. ప్రజా సమస్యలపై గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్య, రోడ్లు, మౌలిక వసతులపై మాట్లాడాలనుకున్న ప్రజాప్రతినిధులకు అవకాశం ఇవ్వకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు. మండల పరిషత్ నిధులు రూ.92లక్షల ఉండగా అధికారులు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై నిలదీస్తామన్న సమాచారంతోనే అధికారులు హడావుడిగా సమావేశాన్ని ముగించినట్లు ప్రజాప్రతినిధులు చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంపీపీ వెంకటరత్నమ్మ, ఎంఈఓ నాగరాజునాయక్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,631.88
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	17.097	24,776
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	16,995	24,237
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.30

మధ్యాహ్న భోజనం తిని ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత

బళ్లారి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో మధ్యాహ్నభోజనం తిని ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం విజయనగర జిల్లా ఇట్టిగుడి తాలూక, బెవినహళ్లి పాఠశాలలో పిల్లలకు అందిస్తున్న బిసి ఊట తిన్న తర్వాత ఈ ఘటన జరిగింది. పాఠశాలలో 120 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరు మధ్యాహ్నం బీసీ ఊట కొందరు తినేశారు, మరి కొందరికి వడ్డిస్తున్నారు. కొద్ది సేపటికే ఇద్దరు పిల్లలు కళ్లు తిరిగి అక్కడే పడిపోయారు. మిగిలిన 25 మంది వరకూ అస్వస్థతకు గురైయ్యారు. వీరిని అక్కడే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. విద్యార్థులకు వైద్యపరిక్షలు చేశారు. విద్యార్థులకు ఎవరికి ప్రాణహాని లేదని డాక్టర్లు తెలిపారు. విద్యార్థుల అస్వస్థతకు కారణం ఏమిటనేది పరీక్షల్లో తేలనుందని వైద్యులు తెలిపారు.

గుప్తనిధుల కోసం శివలింగం ధ్వంసం



ధ్వంసమయిన శివలింగం

బళ్లారి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుప్తనిధుల కోసం గుర్తు తెలియని దుండగులు శివలింగాన్ని ధ్వంసం చేశారు. విజయనగర జిల్లా మరియమ్మనహళ్లి తాలూకా తిమ్మలాపుర గ్రామం వద్ద ఉండే పురాతన త్రికూటేశ్వర ఆలయంలో శివలింగాన్ని గుప్తనిధుల కోసం ధ్వంసం చేశారు. ఈ ఆలయం అత్యంత పురాతనమైనది. ఇది దేవాదాయ శాఖ ఆదీనంలో ఉంది. దుండగులు దేవాలయంలో ఉండే విగ్రహమూర్తులను కూడా ధ్వంసం చేశారు. దీన్ని ఆలస్యంగా గమనించిన గ్రామస్థులు శుక్రవారం ఈటకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీకాంత్ మృతదేహం

బళ్లారిరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బళ్లారిరూరల్ తాలుకాలోని పీడీహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందారు. ఎన్‌హెచ్ 63 రోడ్డుపై గురువారం రాత్రి 11 గంటల సమయంలో మారెమ్మ దేవాలయం, నయారా పెట్రోల్ బంక్ సమీపంలో శ్రీకాంత్ అనే వ్యక్తిని ద్విచక్ర వాహనంలో బళ్లారి నుండి గడేకల్లు వైపు వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనింది. దీంతో ఆ శ్రీకాంత్(40) అక్కడికక్కడే మృతి చెందారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్గం నిమిత్తం బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సామాజిక సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

● ఏ ఒక్క కుటుంబాన్నీ వదలరాదు ● ఎన్యుమరేటర్ల సమావేశంలో జడ్పీ సీఈఓ మహ్మద్ హారీస్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ సీఈఓ మహ్మద్ హారీస్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సామాజిక విద్యాపరిస్థితులపై రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ నిర్వహించిన సర్వే పకడ్బందీగా చేపట్టాలని జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్ అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ నిర్వహిస్తున్న సామాజిక విద్యా సర్వేపై నగరంలోని జిల్లాపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మాస్టర్ ట్రైనర్లకు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర సామాజిక విద్యా అభివృద్ధికి ఈ సర్వే అవసరమని, సెప్టెంబరు 22నుంచి ప్రారంభమై అక్టోబర్ 7వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ సర్వే చేపట్టాలని సీఎం ఆదేశించారన్నారు. దేశంలోనే తొలిసారిగా సర్వే రాష్ట్రంలో నిర్వహిస్తున్నారు. ఇది అన్ని కోణాల్లోనూ ఉపయోగకరంగా ఉంటుంది. ఇది కులసర్వే కాదని సామాజిక సర్వేఅన్నారు. 65ప్రశ్నల యాప్ ద్వారా సర్వే నిర్వహించబడుతుందని, సర్వే సమయంలో ఈ సమాచారం తప్ప మరే ఇతర సమాచారాన్ని అడగకూడదని అధికారులకు సూచించారు. దీనికి అందరి సహకారం అవసరమన్నారు. శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు తమ కింది స్థాయి ఎన్యుమరేటర్లు , సూపర్‌వైజర్లకు సరైన మార్గనిర్దేశన చేయాలన్నారు. సాంకేతిక లోపాలు ఇతర గందరగోళాలు ఉంటే సీనియర్ అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. సర్వేఎటువంటి తేడాలు లేకుండా సజావుగా జరగేలా చూసుకోవాలన్నారు. జిల్లావెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జలాలప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి 10సంవత్సరాలకు ఒకసారి ఈ సర్వే న్విహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా గణాంక శాఖ ప్రకారం2024 సంవత్సరంలో 4,04,000 కుటుంబాలు ఉన్నట్లు అంచనా.సర్వే పనుల కోసం జిల్లాలో 2963 మంది గణనదారులను నియమించామన్నారు. వీరిలో 296మందిని అదనంగా ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 1887మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వివిధ విభాగాలకు చెందిన 472 మంది అధికారులు,సిబ్బంది ఉన్నారు. 135మంది పర్యవేక్షకులు , 63మంది మాస్టర్ ట్రైనర్లు పర్యవేక్షిస్తారన్నారు. సర్వే నిర్వహించడానికి ప్రతి 150 ఇళ్లకు ఒక గణనదారుడిని, ప్రతి 20 గణనదారులకు ఒక పర్యవేక్షకుడిని నియమించాలన్నారు. ఏకుటుంబాన్ని కూడా సర్వేలో మిస్ కాకుండా చూడాలన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన జిల్లాపాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శివలింగారెడ్డి ,జిల్లావిద్యా శిక్షణ సంస్థ లెక్చరర్లు, విజయరంగా రెడ్డి, గంగాధర్,రేవన్నసిద్దప్ప, సర్వేపనులపై శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లాలోని వివిధ తాలూకాల నుండి 63మంది మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి: ఏడీసీ



మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్ జుబేర్

బళ్లారి సిటీ, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో జరుగనున్న అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం కార్యక్రమంలో బళ్లారి జిల్లాకు చెందిన 10 మంది అనుభవజ్ఞులైన బైక్ రైడర్లు సెప్టెంబరు 14న ఉదయం జాతీయ జెండాతో బళ్లారి నుండి బెంగళూరుకు బయలుదేరుతారు. అవసరమైన సన్నాహాలు చేయాలని అదనపు(ఏడీసీ) కమిషనర్ మహమ్మద్ జుబేర్ అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కేశ్వన్ వీడియో ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన ప్రాథమిక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లాలో నిర్వహించే వివిధ కార్యక్రమాలను శాఖల సహకారంతో విజయవంతం చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 15న జరిగే అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ వేడుకల్లో భాగంగా 'నాటటు నాహక్కు' అనే నినాదంతో జిల్లాస్థాయిలో బైక్ ర్యాలీలు,సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బైక్ ర్యాలీని జిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రి, బళ్లారి జిల్లాలలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు జెండాఊపి ప్రారంభిస్తారు. సెప్టెంబర్ 15న బళ్లారి జిల్లా కేంద్రంలో నిర్వహించే సైకిల్ ర్యాలీ కొత్త జిల్లా పరిపాలన భవనం, గడిగి చెన్నప్ప సర్కిల్,కనకదుర్గమ్మ ఆలయం. గవియప్ప సర్కిల్ నుంచి ప్రారంభమై జోళదరాశి దొడ్డనగౌడ రంగ మందిరం వద్ద వేదిక కార్యక్రమంతో ముగిస్తుంది. ర్యాలీ మార్గంలో తాగునీరు, వైద్య సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ,రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు ,ఆఫీస్ బేరర్లు, వివిధ సంఘాలు,సంస్థల సభ్యులు, ప్రజలు పాల్గొని వియవంతంచేయాలని పిలుపు నిచ్చారు. ఈసందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చిదానందప్ప, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి రాజు, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు, ప్రాంతీయ రవాణా అధికారి శ్రీనివాస్ గిరి, డీడీపీఐ , డీడీపీయూ అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘ అభివృద్ధికి సహకరించాలి

● సభ్యులకు అధ్యక్షుడు సిద్దప్ప పిలుపు



వార్షిక సమావేశంలో మాట్లాడుతున్న సిద్దప్ప

కంప్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని దేవలాపుర గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం వార్షిక మహాజనసభ జరిగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గౌడు కే సిద్దప్ప సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సంఘంలో 3,324 మంది సభ్యులు ఉన్నారు. దాదాపు రూ. 94.61 లక్షల వాటా మూలధనం వుందని తెలిపారు. ఇది దాదాపు రూ. 49.40 లక్షలు డిపాజిట్లను సేకరించామన్నారు. రూ. 11.83 లక్షలు వ్యవసాయానికి రుణాలు ఇవ్వబడ్డాయి. సభ్యులు రూ. 187.78 లక్షలు, కేసీసీ రుణాలు 615 మందికి పంపణీ చేయబడ్డాయి. సంఘంలోని మొత్తం రూ. 598.73 లక్షల మంది సభ్యులకు రుణాలు పంపిణీ చేయబడ్డాయి. వీటిలో రూ. 88.10 లక్షల మధ్యకాలిక రుణాలు, రూ. 10.54 లక్షల స్వయం సహాయక సంఘాల రుణాలు ఉన్నాయన్నారు. 2024-25 సంవత్సరంలో రూ. 171.19 లక్షలు ఎరువులు కూడా అమ్ముడయ్యా యన్నారు. సంఘం అభివృద్ధికి అందరి సహకారం అవసరమన్నారు. 2024-25లో ఈ సంఘం రూ. 10.98 లక్షల నికర లాభాన్ని కొనసాగుతుంది. ఈ సంఘం సంవత్సరం తరువాత అభివృద్ధి చెందుతూ చుట్టుపక్కల రైతులకు సేవలను అందిస్తోంది. రాబోయే రోజుల్లో సంఘం మరింత ఉన్నతస్థాయిలో అభివృద్ధి చెందడానికి తోడ్పడాలన్నారు. కార్యదర్శి కొమరప్ప సమావేశ నివేదికను చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షురాలు గుబ్బాజి శిల్పమ్మ రామాంజిని, డైరెక్టర్లు హనుమంతప్ప, గొరవర హనుమంతప్ప, గౌడ్రు షణ్ముఖప్ప, మల్లికార్జున, కరిగనూరు హనుమంతప్ప కే మహదేవప్ప, ముక్కణ్ణ, పూజారి రమేష్, గౌడ్రు మల్లమ్మ, కూరి విశ్వనాథం, దేవరమనె గరుడప్ప నాయకులు, అంజనప్ప, రమేష్, బుడుగన్న, లింగన్నగౌడ్, సిబ్బంది, మారేష్, ఖాసీంసాబ్ వున్నారు.



డీసీ నాగేంద్ర ప్రసాద్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నూతన కలెక్టర్‌తో కాంగ్రెస్ నేతల భేటీ

బళ్లారి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బళ్లారి డీసీగా బాధ్యతలు స్వీకరించిన నాగేంద్రప్రసాద్ ను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం భేటీ అయ్యారు. పార్టీ మీడియా కో-ఆర్డినేటర్, వెంకటేష్ హేగ్డే, ఇతర కాంగ్రెస్ నాయకులు తదితరులు ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం డీసీతో వెంకటేష్ మాట్లాడుతూ బళ్లారిలో ఉన్న సమస్యలు త్వరగా పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కోరారు. ఆయనతో పాటు పలువులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వరిగిన పంట



దెబ్బతిన్న వరి పంట

కంప్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : తాలుకాలో తుంగభద్ర నది తీరాన ఉన్న బెళగోడుహాళ్ సన్నాపురం బసవేశ్వర క్యాంపు నారాయణ స్వామి క్యాంపు ఇటిగి, మున్నూరు సూగూరు తదితర గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి వరి పంటలు నేలకొరిగాయి. బలమైన వర్షాలు కురవడంతో పంట నేలరాలి నష్టపోయినట్లు రైతులు వాపోయారు.పంటలు ఏపుగా ఎదిగే సమయంలో వర్షాలు కురవడంతో పూర్తిగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజుల క్రితం పంటలకు వైరస్ సోకి పంటల ఎదుగుదల ఆగిపోయిందని, దీనికి తోడు వర్షాలు రావడంతో పంటలు పూర్తిగా నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారి సోమశేఖర్ మాట్లాడుతూ నదీ తీర గ్రామాల్లో గ్రామ లెక్క అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది సర్వేలు కూడా చేపట్టి పంటనష్టంపై అంచనా వేస్తున్నామన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయాధికారి రాజేశ్ హొసమనె

మానసిక ఒత్తిడికి లోనుకారాదు

● జీవితంలో సమస్యలు ధైర్యంగా ఎదుర్కోవాలి
● జిల్లా న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జీవితంలో వచ్చే మానసిక ఆర్థిక, సమస్యలతో ఒత్తిడికి లోనవరాదని, ఉద్రిక్తత కారణంగా మానసిక నిరాశకు గురి కారాదని జిల్లా న్యాయాధికారి రాజేశ్ హొసమనె అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవంలో భాగంగా జిల్లా యంత్రాంగం , జిల్లాపంచాయతీ, జిల్లాన్యాయ సేవల ప్రాధికార సంస్థ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లాఆసుపత్రి , జిల్లాపోలీస్ శాఖ, జిల్లా సమాచార ప్రజా సంబందాల శాఖ,జిల్లామానసిక ఆరోగ్య విభాగం సంయుక్తాధ్వర్యంలో నగరంలోని జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆత్మ హత్యలను నివారించడానికి 2003లో ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని ప్రారంభించారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం 173,000 మంది మరణిస్తున్నారు. ప్రతి 11సెకన్లకు ఒకరు మరణిస్తున్నారు.దీనిని ప్రధాన కారణం ఒక వ్యక్తికి ఉండే తీవ్రమైన ఆలోచనలు , అలాంటి వారిని గుర్తించి కౌన్సిలింగ్ ద్వారా చికిత్స చేస్తేవారు కోలుకుంటారన్నారు. జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు మాట్లాడుతూ సమస్యలను కుటుంబ సభ్యులతో ఇంట్లో చర్చించి పరిష్కరించుకోవాలని అన్నారు. పాఠశాలలు,కళాశాలలలో ఆత్మహత్యల గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జిల్లాసర్జన్ బసారెడ్డి మాట్లాడుతూ ఆత్యహత్యల కేసులు ఇటీవల ఆత్మహత్యల కేసులు పెరుగుతున్నాయని, ఆత్మస్థైర్యం కోల్పోకుండా ధైర్యంగా సమస్యలు ఎదుర్కోవాలన్నారు. ఎవరి సమస్యలు వారే సమర్థవంతంగా పరిష్కరించుకోవాలన్నారు. జిల్లా మానసిక వైద్యుడు డాక్టర్ నంద కిషోర్ రెడ్డి మాట్లాడుతూ తీవ్రమైన టెన్షన్,ఒత్తిడి,ఆలోచనల కారణంగా 15-30 ఏళ్ళ వయసు వారిలో ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని జీవనశైలిలో మార్పులు అవసరమని అన్నారు. మానసిక ఆరోగ్య సమస్యలకు ఉచిత హెల్ప్‌లైన్ నంబర్ 14416కు ఫోన్ చేయడం ద్వారా మానసిక సమస్యల నుంచి బయట పడవచ్చన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారిణి డాక్టర్ ఇంద్రాణి, జిల్లా ఆర్‌సీహెచ్ డాక్టర్ హనుమంతప్ప, జిల్లాఆరోగ్య విద్యాధికారిణి ఖుర్షీద్‌బేగం, జిల్లా ఆసుపత్రి సిబ్బంది, జిల్లాపోలీస్‌సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.

భోవి, లంబాడీ రిజర్వేషన్ కోటాను పెంచాలి

● 15న నగరంలో భారీ నిరసనకు పిలుపు



మాట్లాడుతున్న షెడ్యూల్డ్ రిజర్వేన్ల కమిటీ నాయకులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సదాశివ కమిషన్ నివేదికలో ముందుగా నాలుగు కులాలైన లంబాడీ, కొరమ, కొరచ వారికి 4.5 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి ఇప్పుడు 0.5శాతం పెంచి 59 సంచారజాతుల కులాలను చేర్చడం అన్యాయమని రిజర్వేషన్ కమిటీ నాయకులు హనుమంతప్ప, రామాంజనేయులు మండిపడ్డారు. శుక్రవారం నగరంలోని పత్రికభవన్‌లో విలేకరుల సమావేశంలో కమిటీ నాయకులు హనుమంతప్ప మాట్లాడుతూ కమిషన్ ఏడీసీడీఈ వర్గీకరణ చేయాలన్నారు. కానీ ఇప్పుడు ఏబీసీ మాత్రమే చేసిందన్నారు. సిద్దరామయ్య ప్రభుత్వం మన 63 కులాలకు 5శాతం మాత్రమే రిజర్వేషన్లు చేసిందని, . ఏజే సదాశివ కమిషన్ నివేదిక ప్రకారం కోటాను పెంచాలన్నారు. తమ జాతికి 6నుంచి 7 శాతం కోటా ఇవ్వాలన్నారు. సంచార జాతులకు ప్రత్యేక స్థానం ఇవ్వాలని, రిజర్వేషన్ల పెంపు కోసం ఈ నెల 15న నగరంలో జిల్లా స్థాయిలో నిరసన చేపడ్తామన్నారు. నగరంలోని నారాయణరావు పార్క్ నుంచి ఊరేగింపుగా డీసీ కార్యాలయం వరకు చేరుకుని సీఎం , గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. మహేశ్, రామునాయక,రామప్ప భజంత్రీ, వెంకటేశ్, కృష్ణనాయక్, హనుమంత, గోపీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంగనకల్లును నగరపరిధిలోకి చేర్చాలి

● యువ సేన సోషల్‌క్లబ్ అధ్యక్షుడు మేకల ఈశ్వరరెడ్డి




కలెక్టర్ నాగేంద్రప్పకు వినతి పత్రం అందజేస్తున్న యువసేన సభ్యులు

బళ్లారి సిటీ,సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): దాదాపు 18,000 జనాభా ఉన్న సంగనకల్లు గ్రామాన్ని బళ్లారి నగర పరిధిలో చేర్చాలని యువసేన సోషల్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన జిల్లాకలెక్టర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా యువసేన అధ్యక్షుడు మేకల ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ గతంలో సంగనకల్లు గ్రామ పరిసరాల్లో అన్నిపొలాలు ఉన్నందున గ్రామానికి ఆర్‌ఎస్ సైట్స్, ఎన్‌ఏ సైట్స్, బుడా సైట్స్ ఏర్పాటు చేశారన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాజ్‌పేయి లేఅవుట్ , పెద్దబసవేశ్వరలేఔట్, మొదలైన ప్రాంతాలు బళ్లారి మున్సిపల్ కార్పొరేషన్ సౌకర్యాలు పొందుతున్నారన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు ఉపయోగం లేకున్నా సేవలు పొందుతున్నారన్నారు. సంగనకల్లు గ్రామపంచాయితీ నివాసితులు ఎటువంటి ప్రాథమిక సౌకర్యాలు, అభివృద్ధి పనులు కల్పించని సంగనకల్లు గ్రామాన్ని బళ్లారి నగర పరిధిలో చేర్చి అభివృద్ధి చేయాలని కోరుతున్నారని, ఇప్పటికైనా నగర పరిధిలోకి చేర్చాలన్నారు. ఈసందర్భంగాశ్రీనివాస్‌రెడ్డి, ఉప్పర మల్లప్ప, జగన్నాథ్, నారాయణ, వెంకటేశ్, అభిషేక్, బాష, కృష్ణ తదితరులున్నారు.

కనుమరుగవుతున్న మానవ సంబంధాలు

● ఫొటోగ్రఫీ దినోత్సవంలో కొట్టూరు స్వామీజీ



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మూరి కొట్టూర్ స్వామిగళ్

హొస్పేట,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): సాంకేతికత అభివృద్ధి చెందుతున్న నేటి యుగంలో మొబైల్ విప్లవం కారణంగా మానవ సంబంధాలు కనుమరుగవుతున్నాయని ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన జగద్గురు కొట్టూరు స్వామి సంస్థాన్ మఠంకు చెందిన కొట్టూరుస్వామి అన్నారు. శుక్రవారం నగరంలోనిక్రైస్తవ కమ్యూనిటీహాలులో తుంగభద్ర ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నిర్వహించిన 186వప్రపంచ ఫొటో గ్రాఫర్స్ వేడుకలను ఆయన ప్రారంభించి ఆశీర్వదించారు. అందమైన క్షణాలను గుర్తుంచుకోవడానికి ఫొటోగ్రఫీ ఎంతో ఉపయోగకరమన్నారు. ఈకార్యక్రమంలో ఇరకల్‌కు చెందిన జనాబ్ లాల్ హుసేన్ కందగల్ పాల్గొన్నారు.

హోసూరు జోన్

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తం సేకరిస్తున్న స్పందన బ్లడ్ బ్యాంకు, విమ్స్ వైద్యులు

సిరుగుప్ప, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కర్ణాటక సౌహార్ద సహకార సంఘం డైరెక్టర్ హనుమంతయ్య శెట్టి కోరారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణం నిట్టూరు నరసింహమూర్తి ఆవరణంలో సహకార సంఘం రజత మహోత్సవం పురస్కరించుకుని స్వయంప్రేరిత రక్తదాన శిబిర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 300 మందికి పైగా యువకులు స్వయంప్రేరితంగా రక్తదానం చేశారు. స్పందన బ్లడ్ బ్యాంకు, బళ్లారి విమ్స్ వైద్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతయ్యశెట్టి మాట్లాడుతూ మహిళలకు డెలివరీ సమయంలో అత్యవసరంగా రక్తం అవసరమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ దమ్మూరు బసవరాజ, సహకార బ్యాంకు అధ్యక్షులు, పదాధికారులు, పట్టణ ప్రముఖులు చౌదరి, బ్లడ్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు గురై రైతు మృతి



గంగప్ప మాత్రి(ఫైల్)

రాయచూరు సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాయచూరు తాలూకా రఘునాథహళ్ళి గ్రామంలో గురువారం సాయంత్రం పాము కాటుతో ఒక రైతు మృతి చెందాడు. మృతుడిని గంగప్ప మాత్రి(38)గా గుర్తించారు. అతను తన పొలంలో పని చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. గంగప్ప మాత్రి కుటుంబ సభ్యులు అతన్ని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే చికిత్స విఫలమై ఆయన మృతి చెందాడు. ఈ సంఘటన రాయచూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.

పొలాల్లో ఎలుగుబంటి

కంప్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : కనకగిరి తాలుకా పరిధిలోని హుడేజలి గ్రామం వద్ద ఓ పొలంలో ఎలుగుబంటి కనిపించింది. శుక్రవారం సాయంత్రం హుడేజలి గ్రామంలో పక్కనే పొలాల్లో నుండి రోడ్డుపై ఒక ఎలుగుబంటి దాటుతుండగా రైతులు చూసి బెంబేలెత్తారు. ఎలుగుబంటి సంచారంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఎలుగుబంటి తిరుగుతున్న ప్రాంతంలో ఎక్కువగా అటవీ ప్రాంతం వుండటంతో ఏ పొదల్లో నుండి దాడి చేస్తుందోనని పిల్లలు, పెద్దలు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అటవీశాఖ అధికారులు బోను ఏర్పాటు చేసి ఎలుగుబంటిని బంధించాలని కోరుతున్నారు.

పోలింగ్ స్టేషన్లకు ఏఐఏడీఎంకే నిర్వాహకుల నియామకం



నాయకులకు ఓటరు జాబితా అందిస్తున్న దృశ్యం

హోసూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమజిల్లా వేపనహళ్ళి శాసనసభ నియోజకవర్గ పరిధిలోని ప్రతి పోలింగ్‌స్టేషన్‌కు ఏఐఏడీఎంకే నిర్వాహకులను నియమించింది. వచ్చే శాసనసభ ఎన్నికలకు సమాయత్తం అయ్యేలా పార్టీ కేడర్‌లో జాగృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓటర్ల జాబితా అందుబాటులో ఉండడంతో వాటిని పార్టీ బూత్ స్థాయి నాయకులకు అందచేశారు. వచ్చే ఎన్నికలలో పాటించాల్సిన విధి విధానాలపై ఇప్పటినుంచే అవగాహన కల్పిస్తూ పార్టీ కేడర్‌ను బలోపేతం చేయడంతోపాటు ప్రజలను ఏ విధంగా ఆకట్టుకోవాలో సూచిస్తున్నారు. పార్టీ సూళగిరి తూర్పు యూనియన్ కార్యదర్శి సెల్వం నాయకత్వం వహించారు. కేశవన్, ఆనందన్, బసరాయ్, పంచాయతీ మాజీ అధ్యక్షులు రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా వేదవతి నది

బళ్లారిరూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని పరమదేవనహళ్లి సమీపంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షంతో హగరి వేదవతి నది నిండుకుండా ప్రవహిస్తోంది. నదికి ఇరువైపులా ఉన్న మోటార్ పంపుసెట్లుతో పాటు నదితీరాన సమీపంలో ఉన్న పంట పొలాలలో నది ఉధృతంగా ప్రవహించడంతో నీట మునిగాయి. రైతులు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక్కసారిగా గురువారం భారీ వర్షం రావడంతో నది ప్రవాహంలో నీరు అత్యధికంగా రావడంతో ఇరువైపులా ఉన్న రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా మారిందని వాపోయారు.

సిరుగుప్పలో ఎడతెరపిలేని వర్షం

సిరుగుప్ప, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మూడు రోజుల పాటు భారీ వర్షాలతో జనం అతలాకుతలం అవుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవన పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. టెక్కలకోట పట్టణంలో రెండు ఇళ్లు కూలిపోయాయి. భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. రోడ్లపైకి రావాలంటే జనం వర్షాలతో వణికిపోతున్నారు. ఈ యేడాది మే నుంచి సెప్టెంబరు వరకు వరుసగా వర్షాలు పడటంతో పంటలు దెబ్బతినే అవకాశాలు వున్నాయని రైతులు వాపోతున్నారు.



వర్షంలో ఇబ్బంది పడుతున్న వాహనదారులు